# ఏషధర్మః సనాతనః

మళ్ళా నా నోట అనడానికి అసహ్యంగా ఉంది. కాని... అదే నిజం.

నిజం! నాకు ఏనాడో తెలుసును, మా నాన్న 'శుద్ధ...వెధవ' అని:

—అలా అనడానికి నాకే అభిమానం లేనప్పుడు, వినడానికి...నీదేం పోయింది...ఏం, ఎగా దిగా చూస్తున్నావు? నెత్తిన సీలలేమీ... ఊడలేదులే. మతి ఉండి ...నికరంగా చెప్పే మాటే...

అకారణంగా కావేషం పెంచుకుని, అది మభ్యపెట్టడానికి అంటున్నా ననుకున్నావేమో? — భాగాలూ, పంచుకోవడాలూ. ..ఈ ముచ్చట లేమీ అవసరం లేకుండానే...అంథా...పోనీలే, ఎలా వచ్చిందో అలానే తుడుచిపెట్టుకుపోయింది కాదూ!

అందుకు కాదు: ఒకరిని కాదు, సత్తువ ఉంటే పదిమందిని కట్టుకుని ఊరేగినా...నాదేం పోయింది?

సరి, పోయిందే అనుకో: మనకు ఎంత వ్యవహారజ్ఞానం ఉన్నదీ, నీకు తెలుసును కదా?

ఇప్పడైతే ప్రతివాడూ, పూసుకుంటూ వచ్చి — చెపుతాడు: అప్పుడే, ఆదికాలంనాడే నేను మేలుకుని, ఆ కాలో వేలో అడ్డం పెడితే, ఇంత బరిమీరి పోయేవాడా, కాపురానికి యీ అగచాట్లు వచ్చేవా అని:

అవుననుకో: కాని, కాపురం (ఇల్లూ వాకిలీ, పిల్లా మేకా...మ్యునిసిపల్ లెక్కలు దాఖలా)... ఆయనది ఆస్తి — ఆయనది: లేనిది లేకపోగా ... మధ్య కాలో వేలో నలగడ మెందుకూ? — అదీ నా మతం.

—యెవరి చేతకాని తనమైతేనేం, ఇంట్లోవాళ్ళలో... యెవరి జాతకంలో యెన్ని వంకరులుంటేనేం...ఏమైతేనేం, మొత్తానికి తట్టలో కాపురం బుట్టలోకి వచ్చింది...ఆ బుట్టకూ అడుగు ఊడింది:

'తినే వాళ్ళనోట శని ఉండబట్టి ఈ నాటికి ఇలాగైపోయింది కాని, ఆ మహారాజు కేం...నిన్న మొన్నటిదాకా... యెంతవాహినీగా ఉన్నాడు...ఇంతకూ...'

ఛెస్!...లోకం ఒకటా అనేది?...అందుకు అర్థం ఏదీ...

అవును ఎవరు యెంత మొత్తుకున్నా...గుట్టుచప్పుడు కాకుండా ఆ వాహినీ నిలుపుకుందామంటే — అదీ మనచేత కావడంలేదు:

—వెనుక బరువు ఎక్కువచేస్తే...బండీ లేచిపోతుంది ఇక—వెనుకపీటీని — తెర వేసేస్తాను.

—అర్ధరాత్రి, అపరరాత్రి అనకుండా, ఎప్పుడు గుబులు మళ్ళితే...అప్పుడు లేచి, ఆ కొంపలు పట్టుకుపోయేవాడు. ఎప్పుడో ఏజాముకో, ఉసూరుమను

కుంటూ తిరిగి దయచేసి...తలుపు తీయడానికి వస్తూండగానే. ..దబాదిబా బాది ...ఎదుటపడినందుకు...నాలుగు ఆమెను బాది...

—అందుకూ ఊరుకున్నాను: ఎందుకనా, అదివరకాపాఠం వంటపట్టింది...ఆలుమగల తగువు...అది ఎందుకైనా కలిపించుకున్నది కన్నకొడుకైనా ...లోకం హర్షించదు.

—అదొక పరిపాటి కాబోలును. తన తప్పు ముప్పుకునే శక్తిలేని హీనుడు...అదే అవతలవాళ్ళ నెత్తికి చుట్టి... లోకువ గనుకనే!...నోరుమూయించడం...

ఉగ్గుపాలతోనే...రంకు ఒంట యింకిపోయిన...ఆయన...వంట ఇంటనే ముప్పొద్దులూ పాతుకుపడి ఉండే... అమ్మను... అలా తిడితే...ఆ కల్లాకపటం ఎరుగని తల్లి అగచాటుకి... రంపపుకోత పడినా...అందుకూ కిక్కురుమనకుండా ఊరుకున్నాను: ఎట్లైనా...అలి శీలాన్ని అనుకోకుండా అలా గోటితో చిమ్మేసుకుంటే...నాకు ఎలాగైనా...ఎవరికి అసలు తలవంపు...?

అది కాదులే...కాదని గట్టిగా నోరు 'చేసుకునేందుకు...దమ్ములు చాలకనేలే...మన పెంపకం... ముసలమ్మలచేతుల్లో ...అలా అఘోరించింది – చూస్తూకూడా దున్నపోతుమీద పడిన వానగా ... దులిపేసుకున్నది!—

...ఆయన నోటికే కాదు...చేతికీ...అంతకు ముందు ఎన్నడూ నేను అడ్డు వెళ్ళలేదు. కాని...ఎన్ని యేళ్ళు?... అంతంత దెబ్బలు పడటానికి...ఆమెకు, ఆయేడుకాయేడు పైబడినకొద్దీ...సత్తువ ఎక్కడుంది? – ఎన్నడో హొక్కునా.. .హొక్కునా...ఆ రవంత ప్రాణం...

అవాళ...ఆ పాటుచూడలేక పోయినాను: ఇక సహించలేక పోయినాను: అదివరకు ... కోపం పట్టలేనంతగా ఎన్నడైనా అయితే...నోట అసలు మాటవచ్చేది కాదు...కళ్లు కాలువలు కట్టేవి – అలా ఆ కణతను తగిలినదెబ్బకు అమ్మ, దిమ్మ తిరిగి పడిపోతుంటే...ఒక్కసారి వళ్ళు భగాల్‌మని...అందులోనే...ఆమె క్రింద వాలకుండా చప్పున పొదివి పట్టుకోగల నిలకడ...ఆయన చేతి విసురుకు చేయిఅడ్డే తెగువ...చూపుకు చలించక తిరుగచూసే దిట్టతనం...అప్పుడు... నేను, నేనేనా?

'నాకు పుట్టినవాడవైతే ... నన్నే యెదిరించుతావా?...' లక్షతిట్టి, చివరకిది ముక్తాయించాడు.

'నిజమే...' నేను తొణకకుండా జవాబు చెప్పాను. ఆయన ముఖం కండలు చించుకుంటూ ఊరూనాడూ ఏకమయేటంతగా అరుస్తున్నాడు.

'నిజమే...నీ నోటి వెంటనే ఈ నాటికైనా...ఒక్కమాటు నిజమంటూ వచ్చింది. ఏదీ...నీ పోలిక ఒక్కటున్నదేమో చూపించు నాలో. నను కన్న వాడెవరో...మహానుభావుడు'

'అలాగేం...అప్పుడు నీ తల్లి ...ఏమవుతుందో?...పచ్చి బాజారీ...

'అప్పుడూ...నాకు తల్లే. నీకే నన్ను కని, మరో పశువును భూమిమీద వేయకుండా...పరువైన పని చేసింది?. ..పతివ్రత కానందుకే...ఆమెను నేను పూజించేది...'

అది తప్పు అను, ఒప్పను!...ఆర్గ్యుమెంటు కోసమే అయినా...అమ్మ విషయంలో అపచారం చేస్తున్నాననే కించలేశమూ లేకపోగా...అప్పటికీ అదే నిజంగా అవునేమో అనిపించింది.

అమ్మ ముఖంలో, మనసు చివుక్కుమన్న ట్లగుపించింది...విని వినడంతోనే అంతయెత్తు యెగిరిపడి...మీదకు దుమికి...సున్నంలోకి యెముక లేకుండా నన్ను నలగ పొడిచినా...అలా తప్పక చేస్తాడనుకున్నాను సుమా... ఆయనమీద నలుసంత అయినా లక్ష్యం నిలిచేది. అది లేకుండా...అపట్టున...గోలుగోలున ఆడదానికన్న అధమంగా ఏడుస్తూ...ఆవిడ దగ్గిర కూర్చుని..."ఎలాటి కొరవిని కన్నావే...హయ్యో! మన బ్రతుకు చివర కీలా అయిపోయిందేమే...వీడు...మనకెక్కడి – కొడుకే..."

–అలనా పాలనా అలా తగులబడినా...ఆయనతోడి పాటు తప్ప అన్నెమూ పున్నెమూ ఎరుగని ఆమెజాలి ఇరవుచేసుకుని. ..తన అల్పత్వాన్ని అక్కడ దాచుకున్న...ఆ...ఛీప్...వేయడానికి విశేషణం తోచడం లేదు–

–మాడు నిమురుతూ,...చాలీచాలని పైట మెడకు ఉరి అవుతున్నా, బెసిగిలి, అలాగే ఆ చెంగుతోనే, ఆయన కన్నులు తుడుస్తూ...'వాడితో మీకేమిటి? ...ఊరు కోండి...మీరు హైరాన పడకండి...' ఇలా సముదాయిస్తూంది. సమయానుకూలంగా ఆయన దగ్గు తెప్పించుకుంటూంటే, మరీ ఆదుర్దాతో...రాచి, గుండెలు కుదుట పడవేస్తూన్నది. అవును అమ్మ ఎప్పుడూ అంతే. అదుపులో పుట్టి...ఆజ్ఞలో పెరిగిన అయినయింటి ఆడపడుచు! పరేంగిత జ్ఞానం లవలేశమూ ఆ అమాయకురాలికి అబ్బకపోవడం...ఆయన అదృష్టం.

–ఈ స్వస్తి వాక్యాలు అనవసరంగా దొర్లినవి. అయినా, ఎందుకన్నా మంచిదవునులే, అమ్మ పుట్టిన యింటి సంగతి. ..మేనమామకు జ్ఞాపకం చేయడం!...

ఇప్పుడు మరీ ముఖ్యం నిప్పువంటి ఆమెవంక...నాకు వరంగా...వ్రేలెత్తి చూపు తున్నాను. నీవు అభిమానం విడిచి... బింకానికి పోక...మనస్ఫూర్తిగా చెప్పు. అమ్మ నన్ను కనడానికి...పోనీ మనసులోనైనా...అంతకన్న ఎక్కువ నోములు నోచి ఉండకూడదంటావా? – లేకపోతే...

నీవు ఒప్పుకున్నా...తల ఊపనులే...నీ తత్వం నాకు తెలియదూ–?

తప్పు అను – ఒప్పు అను.

అందుకు నీతో పోట్లాడను ... మరి, పోనీ

అవునా...కాదా, మా నాన్న...శుద్ధ...

అది – ఒప్పుకో –

★ ★ ★